'ఇంటర్‌స్టేట్'పై శీతకన్ను

సాగునీటి శాఖలో దిశా నిర్దేశం కరువు

- కృష్ణా, గోదావరి బేసిన్‌లో కీలక పరిణామాలు
- ఉదాసీనంగా రేవంత్ సర్కార్
- బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో కొనసాగుతున్న వాదనలు
- ఢిల్లీలో ఆఫీస్ ఎత్తేసిన ప్రభుత్వం
- కార్యాలయ పునరుద్ధరణను పట్టించుకోని వైనం
- ఎవరికీ చెప్పకోలేక సతమతమవుతున్న అధికారులు
- రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): సాగునీటి ప్రాజెక్టుల పనులకు సంబంధించి సాగునీటి శాఖ పరిధిలోని అత్యంత కీలకమైన అంతర్రాష్ట్ర (ఇంటర్ స్టేట్) జల విభాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తున్నదని శాఖలోని ఇంజినీర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు. నీటి కేటాయింపులు, అనుమతుల సాధన, న్యాయ సంబంధిత సమస్యలు, వాటి పరిష్కారం, పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు అంశాల్లో ఈ విభాగమనే కీలకభూమిక పోషిస్తుందని చెప్తున్నారు. కృష్ణా, గోదావరి బేసిన్‌లో రాష్ట్ర ప్రాజెక్టులకు పొరుగు రాష్ట్రాలు అనేక ఆంటంకాలు కల్పిస్తున్నా, ఆయా అంశాలపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కనీసం దిశానిర్దేశం చేసేవారే లేకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో కీలకమైన వాదనలు కొనసాగుతుంటే అవసరమైన నిధులు, సహాయక సిబ్బందిని కూడా సకాలంలో అందివ్వడం లేదని వాపోతున్నారు.

కృష్ణా బేసిన్‌లో..

ప్రస్తుతం కృష్ణా జలాల పంపిణీకి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట సెక్షన్-3 ప్రకారం వాదనలు కొనసాగుతున్నాయి. మరోవైపు, ఎలాంటి అనుమతులు లేకుండా ఏపీ సర్కారు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పనులను గుట్టుచప్పుడు కాకుండా కొనసాగిస్తున్నది. ఆర్డీఎస్ కుడికాలువ పనులను వేగవంతం చేస్తున్నది. గత సంవత్సరం నవంబర్‌లో నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఏపీ దౌర్జన్యంగా ఆక్రమించిన నేపథ్యంలో కేంద్ర జల్‌శక్తి శాఖ జోక్యం చేసుకుని సీఆర్పీఎఫ్ బలగాలను అక్కడ మోహరించింది. తిరిగి గతంలో తరహాలోనే డ్యామ్ నిర్వహణను తెలంగాణ అజమాయిషీలోకి తీసుకురావాల్సిన అవసరమున్నది. జల విద్యుత్తుకు సంబంధించిన అంశాలపై, తెలంగాణ చేపట్టిన పలు ప్రాజెక్టులపై అనేక అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టుతోపాటు ఇతర వేదికల్లోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలు పిటిషన్లు దాఖలు చేసింది. మరోవైపు, తుంగభద్ర డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం పడిపోయిందని పేర్కొంటూ నావలి రిజర్వాయర్‌ను విస్తరించేందుకు, అప్పర్‌భద్ర ప్రాజెక్టును చేపట్టేందుకు కర్ణాటక సర్కారు దూకుడుగా వ్యవహరిస్తున్నది.



ఢిల్లీలో కార్యాలయం ఎత్తివేత

కృష్ణా, గోదావరి బేసిన్‌లో పొరుగు రాష్ట్రాలు కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నా తెలంగాణ సర్కారు మాత్రం చోద్యం చూస్తున్నదని సాగునీటి రంగ నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కీలకమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన దశలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నదని ఇంజినీర్లు మండిపడుతున్నారు. కీలకమైన ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతుండగా, అందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు అనుభవజ్ఞులైన సాగునీటిరంగ నిపుణులు, న్యాయనిపుణులు కూడా లేకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇంటర్‌స్టేట్ విభాగం సీఈ మోహన్‌కుమార్‌కు సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) సీఈగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర జల వనరుల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్ ఢిల్లీకే పరిమితమయ్యారు. రాష్ట్రానికి ప్రాజెక్టుల అనుమతుల సాధనలో భాగంగా కేంద్ర సంస్థలతో నిత్యం సంప్రదింపులు జరిపేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఢిల్లీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యాలయాన్ని సైతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసింది. ట్రిబ్యునల్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఢిల్లీలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, ఒక ఎస్ఈ, ఈఈతోపాటు సపోర్టింగ్ స్టాఫ్‌ను అక్కడ నియమించాలని ప్రతిపాదనలు పంపినా ఇప్పటికీ పట్టించుకోవడం లేదని ఇంజినీర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ట్రిబ్యునల్ విచారణలో భాగంగా ప్రతి నెలా ఢిల్లీకి చక్కర్లు కొట్టాల్సి వస్తున్నదని, జేబులో నుంచి డబ్బులు పెట్టుకుని వెళ్లాల్సి వస్తున్నదని, ఆ నిధులను కూడా ప్రభుత్వం సకాలంలో విడుదల చేయడం లేదని ఇంజినీర్లు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా అంతర్రాష్ట్ర విభాగంపై దృష్టి సారించాలని, ప్రత్యేక అధికారిని నియమించాలని కోరుతున్నారు.

గోదావరి బేసిన్‌లో..

గోదావరి బేసిన్‌లోనూ అనేక సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోయి ఉన్నాయి. గోదావరి ట్రిబ్యునల్‌ను ఏర్పాటుచేయాలని ఏపీ ఇప్పటికే కేంద్రాన్ని కోరగా, ఆ దిశగా చకచకా అడుగులు పడుతున్నట్టు తెలుస్తున్నది. సమ్మక్కసాగర్ బరాజ్‌కు సంబంధించి పొరుగున ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీని తీసుకోవాల్సి ఉన్నది. సీతారామ ప్రాజెక్టుకు అనుమతుల సాధన పెండింగ్‌లోనే పడిపోయింది. పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలో వాటిల్లే ముంపుపై జాయింట్ సర్వే చేపట్టాలని ఎన్నిసార్లు లేఖలు రాసినా ఏపీ సర్కారు పెడచెవిన పెడుతున్నది. ప్రతిపాదిత సామర్థ్యానికి మించి ప్రాజెక్టు కాలువల తవ్వకాన్ని, దానిపై పలు ఎత్తిపోతల పథకాలను యథేచ్ఛగా చేపడుతున్నది. కేంద్ర ప్రభుత్వం సైతం గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టేందుకు వేగంగా అడుగులు వేస్తున్నది. త్వరలోనే అన్ని రాష్ట్రాలతో కీలక సమావేశాన్ని నిర్వహించి తుది నిర్ణయం తీసుకుంటామని ఇటీవలనే కేంద్ర జల్‌శక్తి శాఖ తేల్చిచెప్పింది. గౌరవెల్లి తదితర ప్రాజెక్టులపై ఎన్జీటీలో కేసులు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయి.

'పాలమూరు'కు గ్రహణం!

- సొంత జిల్లా ప్రాజెక్టును పట్టించుకోని ముఖ్యమంత్రి
- ఏపీ జలదోపిడీకి దిగుతున్నా కాంగ్రెస్ సర్కారు మౌనం
- ప్రాజెక్టులపై ప్రతినెలా అసలే జరగని సమీక్ష
- నిధులు విడుదల చేయక నిలిచిన పనులు
- యాసంగికి నీళ్లిచ్చే పరిస్థితి లేదు

మహబూబ్‌నగర్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోని అతిపెద్దదైన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గ్రహణం పట్టింది. 2023 డిసెంబర్‌లో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పాలనకు ఏడాది దాటినా ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా కేటాయించలేదు. ఫలితంగా సాగునీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. అధికారంలోకి వచ్చి మూడు నెలల తర్వాత పాలమూరుకు వచ్చిన సీఎం ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహిస్తూ ప్రతినెలా అన్ని ప్రాజెక్టుల స్థితిగతులపై అధికార యంత్రాంగంతో చర్చించాలని ఆదేశించారు. పాలమూరు ఎత్తిపోతల పథకంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్న సీఎం ఆదేశాలు బుట్టదాఖలయ్యాయి. మరోవైపు కృష్ణ బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ జలదోపిడీ యథేచ్ఛగా కొనసాగుతున్నది. తాజాగా దొంగే దొంగ అన్నట్టు.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై కృష్ణా ట్రిబ్యునల్‌కు ఏపీ ఫిర్యాదు చేయడం.. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మౌనం వహించడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. సొంత జిల్లాకు చెందిన సీఎం ఈ ప్రాజెక్టును పట్టించుకోకపోవడంపై వచ్చే యాసంగి నాటికి సాగునీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. దాదాపు 95 శాతానికిపైగా పూర్తయిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ఈ ఎత్తిపోతల పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

కేసీఆర్ ప్రభుత్వ నిధులతోనే పనులు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా నిర్మాణ పనులు చేపట్టింది. 2023 అక్టోబర్‌లో కేసీఆర్ కొల్లాపూర్ సమీపంలో పాలమూరు లిఫ్ట్-1 ట్రయల్‌రన్‌ను ప్రారంభించి జిల్లా ప్రజలకు అంకితం చేశారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే ఇటీవలి వరకు పనులు చేపట్టారు. ఈ పథకంలో భాగంగా ప్రధానమైన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్ల నిర్మాణం దాదాపుగా పూర్తికావచ్చింది. ఒక్క ఉదండాపూర్ రిజర్వాయర్ మాత్రమే నిర్మాణ దశలో ఉన్నది. కొల్లాపూర్ సమీపంలోని ఎల్లూరు రిజర్వాయర్ పూర్తి కావడంతోపాటు దాదాపు రెండు టీఎంసీల నీటిని నిల్వచేశారు. అక్కడి నుంచి ఏదుల రిజర్వాయర్‌కు గ్రావిటీ ద్వారా వచ్చే కెనాల్ వర్క్ పూర్తి కావాల్సి ఉన్నది. ఏదుల వట్టెం, ఉదండాపూర్ పంప్‌హౌస్ నిర్మాణం పూర్తి కావడంతోపాటు బాహుబలి పంపులను కూడా బిగించారు. ఇటీవల వట్టెం పంప్‌లో మూడు పంపులను డ్రైరన్ చేపట్టి విజయవంతం చేశారు.

నిధులే ఇవ్వని సర్కారు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయిని పాలమూరు ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది. ఇప్పటివరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దాదాపు 12 లక్షలకు పైగా ఎకరాలకు నీరు అందించే పాలమూరు ఎత్తిపోతల పథకం గురించి కాంగ్రెస్ నేతలు ఊసే ఎత్తడం లేదు. గుత్తేదారులు పనులను నిలిపివేసి వెళ్లిపోయారు. కొందరు అధికారులు మాత్రమే పర్యవేక్షిస్తున్నారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి సర్కార్ సిద్ధంగా ఉన్నదని, ప్రతినెలా కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలతోపాటు పాలమూరు ప్రాజెక్టుపైనా సమీక్ష జరపాలని సంబంధిత మంత్రితోపాటు అధికారులనూ ఆనాడు సీఎం ఆదేశించారు. కానీ ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పెండింగ్ ప్రాజెక్టులపై ఆ ఊసే లేదు. అధికార యంత్రాంగం కూడా సర్కారుకు ఫైల్‌నోట్ ద్వారా నివేదించినా ప్రభుత్వంలో ఉలుకూ లేదు పలుకూ లేదు.

యాసంగిపై తీవ్ర ప్రభావం

భారీ వర్షాలతో నిండిన జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లో ఉన్న నీటిని సాగుకు క్రమంగా వదులుతున్నారు. దీంతో యాసంగి సాగుకు రైతులు సిద్ధమయ్యారు. కృష్ణా బేసిన్‌లో మార్చి వరకు సాగు, తాగునీటికి ఢోకా ఉండదని భావించారు. ప్రస్తుతం అందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్ జలదోపిడీకి పాల్పడుతుండటంతో జనవరి నెలాఖరు నాటికే శ్రీశైలం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరే అవకాశం ఉన్నదని ఆందోళన చెందుతున్నారు. కేఎల్ఐకి నీరందని పరిస్థితి దాపురించింది. ఈ పథకానికి గ్రీన్ చానల్ ద్వారా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా అవి కూడా నీటి మూటలుగానే మారిపోయాయి. ఈ పథకానికీ నయా పైసా విదిల్చలేదు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా యాసంగికి సాగునీరు అందుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని రైతాంగం కోరుతున్నది.

నాగార్జునసాగర్ డ్యాం పైన పహారా కాస్తున్న టీజీఎస్‌పీఎఫ్ పోలీస్

ప్రత్యేక రక్షణ దళం ఆధీనంలో నాగార్జునసాగర్

13 నెలలుగా సీఆర్‌పీఎఫ్ బలగాల ఆధీనంలోనే..

నందికొండ, డిసెంబర్ 28 : నాగార్జునసాగర్ డ్యాం భద్రత రాష్ట్ర ప్రత్యేక రక్షక దళం (టీజీఎస్‌పీఎఫ్) పరిధిలోకి వెళ్లింది. నిరుడు నవంబర్ 29న డ్యామ్ నిర్వహణ, భద్రతపై రెండు రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తడంతో నిర్వహణ కేంద్ర బలగాల ఆధీనంలోకి వెళ్లింది. సీఆర్‌పీఎఫ్ బలగాలు రెండు బృందాలుగా విడిపోయి తెలంగాణ వైపు 13వ గేట్ వరకు ఒక టీమ్, అక్కడి నుంచి ఏపీ వైపు మరో టీమ్ విధులు నిర్వహిస్తున్నాయి. తాజా నిర్ణయంతో శనివారం సీఆర్‌పీఎఫ్ బలగాలు నాగార్జునసాగర్ డ్యామ్ భద్రత నుంచి వైదొలిగారు. సీఆర్‌పీఎఫ్ బలగాలు డ్యామ్ భద్రత నుంచి వైదొలగినట్టు లిఖితపూర్వత ఆదేశాలు అందలేని ఎన్ఎస్పీ సీఈ అజయ్‌కుమార్ తెలిపారు. ఆంధ్రావైపు సీఆర్‌పీఎఫ్ బలగాలు కాపలా కొనసాగిస్తున్నాయి. రెండువైపులా ఉన్న టీమ్‌లు ఒకేసారి అక్కడి నుంచి రావాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశించడంతోనే తెలంగాణ వైపు నుంచి వెళ్లిపోయిన సీఆర్‌పీఎఫ్ బలగాలు తిరిగి వస్తున్నట్టు తెలుస్తున్నది.

భాషా, సంస్కృతిని కాపాడుకోవాలి

- తమిళనాడు తరహాలో పాలకులు కృషి చేయాలి
- ప్రపంచ తెలుగు మహాసభల్లో జస్టిస్ ఎన్వీ రమణ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): అభివృద్ధితోపాటు భాషా, సంస్కృతులను రక్షించుకోవాలని సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. ఈ విషయంలో తమిళనాడు తరహాలో మన పాలకులూ భాషాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విజయవాడలో జరుగుతున్న తెలుగు మహాసభల్లో శనివారం ఆయన మాట్లాడారు. తెలుగు జాతి కీర్తి నిత్యం వెలుగొందాలని ఆకాంక్షించారు. తెలుగు భాష పలుకుబడి వినసొంపైనదని, సంగీతంలా ఉంటుందని పేర్కొన్నారు. వ్యాపార, రాజకీయ ప్రయోజనాల కోసం వేరే భాష, సంస్కృతి వచ్చి తెలుగును కొల్లగొట్టడాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని ఆయన హెచ్చరించారు.

'దోస్త్' తరహాలో 'జోస్త్'

- ఆన్‌లైన్‌లో ఇంటర్ అడ్మిషన్లు
- జూన్ నుంచే ఆన్‌లైన్ ప్రవేశాలు
- 'పది' మార్కుల ఆధారంగా సీట్లు ఫీజులు ఖరారు చేస్తామంటున్న అధికారులు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : ఇంటర్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లకు రంగం సిద్ధమవుతున్నది. డిగ్రీ అడ్మిషన్లకు అనుసరిస్తున్న 'దోస్త్' తరహాలోనే ఇంటర్‌లో జూనియర్ కాలేజీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (జోస్త్) విధానాన్ని తీసుకురానున్నారు. ఇంటర్ బోర్డు వచ్చే విద్యాసంవత్సరం(జూన్) నుంచి ఫస్టియర్‌కు ఆన్‌లైన్‌లోనే అడ్మిషన్లు కల్పిస్తారు. పదో తరగతి మార్కుల ఆధారంగా మెరిట్‌ను బట్టి, విద్యార్థులు ఎంచుకున్న ఆప్షన్ల ప్రకారం సీట్లు భర్తీచేస్తారు. డిగ్రీ సీట్లను 'దోస్త్' ద్వారా భర్తీచేస్తున్నారు. ఈ విధానంతో ప్రైవేట్ కాలేజీల ఆగడాలకు అడ్డుకట్టపడింది. ఇదే తరహాలో ఇంటర్‌లోనూ అడ్మిషన్లు కల్పించనున్నారు. ఇది వరకు పదో తరగతిలో గ్రేడింగ్ విధానముండటంతో మెరిట్ ప్రకారం సీట్లను కేటాయించలేని పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది నుంచి పదో తరగతిలో గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేశారు. విద్యార్థులకు గ్రేడ్ల స్థానంలో మార్కులను జారీచేయాలని నిర్ణయించారు.

నచ్చిన కాలేజీలో అడ్మిషన్లు..

రాష్ట్రంలో 1200 పైచిలుకు ప్రైవేట్ కాలేజీన్నాయి. కొన్ని కార్పొరేట్ కాలేజీల్లో అడ్మిషన్ల విషయంలో ఆడింది ఆట పాడింది పాట అన్నట్టుగా సాగుతున్నది. పదో తరగతి పరీక్షలుకాకముందే, ఫలితాలు వెలువడకముందే, ఇంటర్ అడ్మిషన్ నోటిఫికేషన్ రాకముందే డిసెంబర్‌లోనే ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. దీంతో సర్కారు కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు ఉండకపోవడంతో అవి కునారిల్లుతున్నాయి. కొత్త విధానంతో ఆన్‌లైన్‌లో గుర్తింపు పొందిన కాలేజీల జాబితాను పొందుపరుస్తారు. విద్యార్థులు ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఎంచుకోవాలి. ఆప్షన్లు, మెరిట్‌ను అనుసరించి సీట్లు కేటాయిస్తారు. దీంతో సర్కారు, ప్రైవేట్ కాలేజీలన్న తేడా లేకుండా ఒకేసారి అడ్మిషన్లు కల్పించడంతో అడ్మిషన్ల దందాకు చెక్‌పడనుంది. ఆన్‌లైన్ అడ్మిషన్లతో విద్యార్థి తనకు నచ్చిన కాలేజీలో చేరే అవకాశముంటుంది.

మరి ఫీజులు ఎలా?

ఆన్‌లైన్‌లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు కల్పించాలని భావిస్తున్న విద్యాశాఖకు ఇప్పుడు ఫీజుల రూపంలో కొత్త సమస్య తలెత్తనుంది. ఇంటర్ కోర్సుల ఫీజులను ఇప్పటి వరకు ఖరారుచేయలేదు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ఇష్టారీతిన ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు కల్పిస్తే ఫీజులెలా..? ఎవరికి చెల్లించాలన్న సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. సర్కారు కాలేజీల్లో ఉచిత విద్యనందిస్తున్నారు. మాడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో కొత్త అడ్మిషన్లు కల్పించడంలేదు. ఉన్న విద్యార్థులనే అప్‌గ్రేడ్ చేస్తున్నారు. కార్పొరేట్ కాలేజీల్లో చేరేవారు హాస్టల్, ఎప్‌సెట్, జేఈఈ, నీట్ వంటి కోచింగ్‌ను ప్రమాణికంగా తీసుకుంటారు. వీటన్నింటిని ఎలా పరిష్కరిస్తారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆన్‌లైన్‌లో ప్రవేశాలు కల్పిస్తుండటంతో ఫీజులు పెంచాల్సి ఉంటుందన్న వాదనలున్నాయి.

అమలు ఇలా..

- సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను సిద్ధంచేస్తారు.
- ముందుగా ఇంటర్ బోర్డు ప్రవేశాల నోటిఫికేషన్ జారీచేస్తుంది.
- విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేస్తారు.
- ప్రైవేట్, సర్కారు, కేజీబీవీలు, మాడల్‌స్కూల్స్, గురుకులాల జాబితాను ప్రదర్శించి, విద్యార్థుల నుంచి వెబ్ ఆప్షన్లు స్వీకరిస్తారు.
- మెరిట్ ప్రకారం, వెబ్ ఆప్షన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

విద్యార్థులకు డ్రగ్ ఫ్రీ వెల్‌నెస్ కోర్సు

ఏడీస్టీవ్ ఫౌండేషన్‌తో టీజీ న్యాబ్ ఎంవోయూ

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు ప్రత్యేకంగా వివరించేందుకు ఏడీస్టీవ్ ఫౌండేషన్ అండ్ క్రియేట్ ఎడ్యుటెక్‌తో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో జతకట్టింది. క్రియేట్ ఎడ్యుటెక్‌లో భాగంగా 'డ్రగ్ ఫ్రీ వెల్‌నెస్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎంవోయూ కుదుర్చుకున్నట్టు టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. చురుకైన విద్య, అవగాహన ద్వారా మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని పరిష్కరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రియేట్ ఎడ్యుటెక్ ప్రతినిధులు కొండూరు సంస్కృతి, చాడ శ్రీహర్షితను అభినందించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను రూపొందించేందుకు ఈ ఒప్పందం మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. 14ఏండ్ల కొండూరు సంస్కృతి సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు.. కాగా, ఆమె ఎస్ఐబీ ఐజీ సుమతి కూతురు కావడం విశేషం.

ఎంబీబీఎస్ సీట్ల అవకతవకలపై లీగల్ సెల్

కాశీబుగ్గ, డిసెంబర్ 28: రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో మెరిట్ విద్యార్థులకు ఏమైనా అన్యాయం జరిగితే న్యాయం కోసం వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో లీగల్ సెల్ ఏర్పాటు చేసినట్టు మండలి జాతీయ ప్రతినిధి సాంబరాజు చక్రపాణి తెలిపారు. రాష్ట్రంలో మూడు మెడికల్ కాలేజీలకు 550 సీట్లు కేటాయించి, డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడానికి ఎన్‌వోసీ ఇవ్వలేదని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఈ నెల 3న వినియోగదారుల మండలికి సమాచారం ఇచ్చినట్టు చక్రపాణి తెలిపారు. ఈ క్రమంలో డీమ్డ్ వర్సిటీల పేరిట వెబ్‌ఆప్షన్స్ నుంచి తీసేసిన 550 సీట్లు తిరిగి రాష్ట్ర విద్యార్థులకు కేటాయించాల్సి ఉన్నదని ఆయన సూచించారు. అర్హులు ఎంబీబీఎస్ సీట్లు పొందడానికి అవసరమయ్యే న్యాయ సలహాలు, ఫిర్యాదుల దాఖలుకు హైకోర్టు న్యాయవాది యశ్వంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో లీగల్‌సెల్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అన్యాయం జరిగినవారు వివరాలను 9440328239కు మెసేజ్ చేయాలని సూచించారు.

కూకట్‌పల్లి క్లాస్‌లను.. వనపర్తిలో వినొచ్చు!

- జేఎన్టీయూలో లైవ్ స్ట్రీమింగ్ తరగతులు
- ఫ్యాకల్టీ కొరతను అధిగమించేలా చర్యలు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : జేఎన్టీయూ కూకట్‌పల్లి క్యాంపస్‌లో ప్రొఫెసర్లు క్లాసులు చెబుతుంటారు.. ఇవే పాఠాలను జేఎన్టీయూ వనపర్తిలోని విద్యార్థులు ఎంచక్కా వినొచ్చు. వనపర్తి జేఎన్టీయూయే కాకుండా సిరిసిల్ల, మహబూబాబాద్, పాలేరు జేఎన్టీయూల్లోని విద్యార్థులంతా ఈ పాఠాలను సద్వినియోగం చేసుకోవచ్చు. ఇలాంటి అవకాశాన్ని జేఎన్టీయూ అతి త్వరలో కల్పించనున్నది. ఇటీవలీ కాలంలో జేఎన్టీయూకు అనుబంధంగా వనపర్తి, సిరిసిల్ల, పాలేరు, మహబూబాబాద్‌లో కొత్త ఇంజినీరింగ్ కాలేజీలను మంజూరుచేశారు. వీటిల్లో అంతంత మాత్రంగానే విద్యార్థులు చేరారు. అయితే ఇవి కొత్త కాలేజీలు కావడంతో కొన్నింటిలో ఫ్యాకల్టీ కొరత సమస్య వేధిస్తున్నది. దీంతో క్లాసులు సవ్యంగా సాగడంలేదు. సమస్యను తీర్చేందుకు వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు వర్సిటీలోని స్టూడియో సేవలను వినియోగించుకోనున్నారు. గతంలో లక్షలాది రూపాయలు ఖర్చుచేసి జేఎన్టీయూలో స్టూడియోను నిర్మించారు. అధునాతన కెమెరాలు కొనుగోలు చేశారు. కానీ ఇవన్నీ నిరూపయోగంగా మారాయి. తాజాగా జేఎన్టీయూ కూకట్‌పల్లిలో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని నిర్ణయించారు. ఆచార్యులు చెప్పే క్లాసులను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రసారం చేస్తారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో సందేహాలను నివృత్తిచేసుకోవచ్చని ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫేక్ ఫ్యాకల్టీని అరికట్టేందుకు ఫ్యాకల్టీ ఫొటోలను కాలేజీల్లో ప్రదర్శించే యోచన చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఈ విధానం కొన్ని కాలేజీల్లో అమలవుతున్నదని, అన్ని కాలేజీల్లోని ఫ్యాకల్టీ ఫొటోలను ప్రదర్శించాలని ఆదేశాలిస్తామని తెలిపారు.

ఇంజినీరింగ్‌కు కొత్త సిలబస్

- ఆర్- 25 పేరుతో రూపకల్పన
- జేఎన్టీయూ కసరత్తు వేగవంతం
- ఏఐసీటీఈ, ఐఐటీ మద్రాస్ సహకారం
- జనవరి 7, 8 తేదీల్లో మేధోమథనం

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మార్కెట్ ట్రెండ్స్, పరిశ్రమలు ఆశించిన నైపుణ్యాల ప్రకారం కొత్త సిలబస్ రూపకల్పనకు జేఎన్టీయూ కసరత్తు ముమ్మరం చేసింది. వర్సిటీ పరిధిలోని అన్ని కోర్సుల కరికులాన్ని మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఆర్-25 పేరుతో కొత్త సిలబస్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. ఇందుకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ)మాడల్ కరికులం, ఐఐటీ మద్రాస్‌లో నిర్వహిస్తున్న కోర్సుల సిలబస్‌ను ప్రమాణికంగా తీసుకుని కొత్త సిలబస్‌ను రూపొందించనున్నారు. జేఎన్టీయూలో ప్రతి మూడేండ్లకోసారి సిలబస్ మార్చడం ఆనవాయితీ. ఆర్-22 పేరుతో మూడేండ్ల క్రితం సిలబస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సిలబస్ గడువు ముగియనున్నది. తాజాగా ఆర్-25 పేరుతో కొత్త సిలబస్‌ను రూపొందించనున్నారు. జేఎన్టీయూ ఆచార్యులు ఇప్పటికే కొంత మాడల్ సిలబస్‌ను రూపొందించారు. అందులో మార్పులు.. చేర్పులు చేసి, పూర్తి స్థాయి సిలబస్‌ను రూపొందించనున్నారు. ఇందుకోసం 7న నోవాటెల్